# బ్యూటీ అండు డ్యూటీ

"మేకు బండీ - లాంగు దూటు!
రేకు బటనుల - కాకి కోటు!
ఓర క్యాపు! - లారీ చూపు!
ఎవడె వాడు?"
"ఎరగవోలె?"
"ఊఁ ఊఁ!"
"నా సచ్చినట్టె?"
"ఊఁ ఊఁ!"

ఈలా పాటరూపంలో ప్రశ్నోత్తరాలు జరిగిపోతున్నాయి. నడకలోనే ఆ యిద్దరి పడుచులకు - ఒకామె రైటిస్టు ఒకామె లెఫ్టిస్టులాగ దోచేరువారు. వారు వేసికొన్న పయటల్నిబట్టి - ఒకామె పయట ఎడం బుజంమీదకుంది. ఒకామె పయట కుడి బుజంమీదకుంది.

దూరాన్ని చింతలక్రింద అమ్మకానికున్న గుత్తాలు విగ విగలాడిపోతూ తోకలాడిస్తూ ప్రపంచ చాపల్యాన్ని దృష్టాంతీకరిస్తున్నాయి. ఆ ప్రాంతాన్నే మతోచోట తురాయి చెట్టుక్రింద ఓ బుడబుడక్కలాళ్ళ పక్కా చక్కంది చుక్కచుక్కల సంచి దిండుగా వేసుకు దానిమీదను వొరిగి అదో వొయ్యారంగా నిదరిస్తూ ప్రాణియొక్క పొందికా పునాది ప్రతిపాదిస్తూ వుంది. ఆ యా దృక్పథాల తారతమ్యాలూ రమ్యాలూ బోధపడుతూ వున్నా వీళ్ళిద్దరి యిదీ జంగమం అనాలో స్థావరం అనాలో నాకు తట్టలేదు ఆ గడియప్పుడు. ఎంచేతా అంటే వీళ్ళ యిద్దరి దగ్గఱకూ వచ్చేసరికి చూడ్డమే పెద్ద పని అయింది. ఇక బుద్ధికి

మనస్సుకూ ప్రమేయం లేకపోయింది, ప్రయోజనం లేక పోయింది!

కుడి పయటది వెంటనే తన కుడిచేయి ఎడంపయటదాని మెడమీదకు వేస్తూ మిక్కిలీ నేస్తంగా చెవిలో మాటల్లే ఎదో వూదింది—వుఱసే అది వుత్తి గాలి కాదు—అవల విన్న మనిషివో చిరునవ్వు నవ్వుతూ తన ఎడంచేయి అలా కుడి పయట దాని మెడమీదకు వేస్తూ—అంతకంటె మిక్కిలీ నేస్తంగా అంతకంటె చెవిలో మాటల్లే ఎదో పలికింది—పలుకే అది, కాని బంగారంలా మెఱిసింది.

పై ప్రస్తావనలో తుమ్మముళ్ళ వాటంగా రోడ్డుమీద వాళ్ళకు ఎడాపెడా తగిలిన వాక్యాలు—"అడికిప్పుడు నెలకు ముప్పై రూపాయిలు జీతం!" "కుఱ్ఱోడే!" "అదే బ్యూటీ!" "డ్యూటీ ఏకాడో?"—వాక్యాల్తోపాటు మోగినవి వట్టిపై యున్న రెండు ఇత్తడి టిఫిన్ కారియర్లు—దాని చేతిలోని దొకటి—దీని చేతిలోని దొకటి. మూతలెగిరి మూతలు క్రింద పడ్డాయి—సొక్కిన సొక్కులు సాల్లేదు కామోసు.

"ఇయే గాజులై తేనో?" "ఇలాంటప్పుడు ఆ లారీ యీ కారియర్ల మీద నుండి పోతేనో?" అని ఎవరికి వారను కొంటూ మూత లెత్తుకోవడంలో ఆ మూతలు తిరిగి ఎవరి కారియర్లకు వారు అమర్చుకోవడంలో అలా అలా చెట్టా పట్టాలు విడ్డారు పడుచు లిద్దరూను. ఆ పడ్డ అవకాశంలో ఆ కుపింత సేపట్లో ముగ్గురికి బాటసారులకు దారెట్టారు కూడాను విడ్డూరం గొలుపుతూ! మళ్ళీ సంభాషణ!

"మనం ఇంటికి చేరుకునేలా లారీ మళ్ళా ఇలా ఎద రొస్తుందంటావా?" అని అడిగింది ఎడంపయట వేసికొన్నది.

"మరి ఇల్లారాదు. అసలీ యూరే రాదనుకుంటాను. ఆళ్ళందర్నీ ఎక్కడికో తీసుకువెడుతూ వున్నట్టున్నారు." అని కుడి పయటది జవాబు చెబుతూ, ఆలా తన కుడిచేత్తో తన మొగ మ్మీదకు చెదరిపడే చికురాల్ని వెనక్కి వొత్తుతుంది. రెండోది తన ఎడంచేతి వ్రేళ్ళతో ఆలా తన వోణి అంచును బొడ్డుదరి నుంచి భుజందాకా, వీణ తీగ రాచినట్టు రాచి దేహయష్టి పుష్టి స్త్రీ సృష్టి కాసంత కాపరిచింది. దానిది కుడిచేతివాటం దీనిది ఎడంచేతివాటం అనుకుంటాను.

"బ్యూటీ" "డ్యూటీ" అని రెండు ఇంగ్లీషు ముక్కలు వాళ్ళ నోటంట విన్నాం గదా అని వాళ్ళను, పాఠకులు, మహా సంపన్నరాంధ్రులుగాను, మహా మహా విద్యావంతులుగాను, మహా మహా సంస్కారిణులుగాను తరపోయకండి. భాష అన్నది ముఖే ముఖే—ఒక్కొక్కప్పుడు వాళ్ళకే తెలీకుండా ఆలా వచ్చే సేస్తుంది. అప్రయత్నంగా ఎప్పుడో ఎక్కడో విని వుంటారు. అప్రయత్నంగా ఇప్పుడు ఇక్కడ వప్పచెప్పి వుంటారు.

కాని ఆ రెండు మాటలూ, ఇంగ్లీషు వచ్చిననాటి మనుష్యుల కందఱకూ చిరకాలంనుంచీ పరిచయమైన మాటలే. ఇంగ్లీషువా రెప్పుడు ఈ దేశంలో అడుగుపెట్టారో ఆనాడే వాళ్లీ ఈ "భారతలక్ష్మిని" "బ్యూటీ!" అని సంబోధిస్తూ అడుగు పెట్టారు. వారికి స్వాగతం ఇవ్వడం భారతీయులు తమ "డ్యూటీ" గా భావిస్తూ ఇంట్యూషన్ శక్తినే ఆ మాటను కంఠతాపట్టారు. ఈ భాగాన్ని గురించి మరి విమర్శించేందుకు నాకు తీరికాలేదు చేరికాలేదు. అయినా మనదేశంలో చారిత్రక విమర్శకులు మానసికవేత్తలు చాలామంది వున్నారు. వారి కృషి

నేను అవలంబించడం అంత మేలూ కాదు మోహర్బానీ కాదు. కాని వొకటిక్కి వొత్తిచెప్తాను. ఆ రెండు మాటలూ. చాలా చాలా గొప్పమాటలు అని....మనకు రెండు చెవులు, ఎలాంటివో, రెండు కళ్లు ఎలాంటివో, రెండు చేతు లెలాంటివో, రెండు కాళ్లు ఎలాంటివో, రెండు నాసికారంధ్రా లెలాంటివో, అలాంటివి ఆ రెండు మాటలూ అని నా నమ్మకం!

కలం ఎంచేతో గబగబా మతీ ముందుకు నడవనంటూ వుంది. ఈ కథయొక్క బ్యూటీ అంతా అందులోనే వుందో ఏమో—కథకుని డ్యూటీమాట ఏలావున్నా!

ఒక్కొక్కప్పుడు బస్సుకు తోతయిచ్చినట్టు ఆతగాడి మనస్సుకూడా తోతయియ్యాలో ఏమిటో?—

అంతలో అటువెళ్ళిన లారీ తిరిగి యిటేవస్తూ వీళ్ళకు ఈ వయసు కత్తెలకు మళ్ళీ ఎదురైంది. "అప్పుడే తిరిగి వెనక్కు వచ్చేస్తూ వుందేమిటే—ఆ లారీ? అంది ఎడం పయటది. మతీ కుడి పయటది "అంతలోనే డ్యూటీ మాఱింది కాబోలు. ఆళ్ళకి" అంది.

ఇద్దరూ ఆ లారీ వంక దావి వేగంవంక చూస్తూ నిలబడి పోయారు రోడ్డువార. "మళ్ళీ ఇలా వస్తుందా?" అంది ఎడం పయటది. మఱిల్లా రాదనుకుంటాను. ఇందాకా ఎందుకొచ్చిందో గాని!" అంది కుడిపయటది. "నీకెల్లాతెలుసు — నీకేం పంచాంగం వచ్చా?" అంది ఎడంది. "ఆడు మనల్ని ఆలా రమ్మన్నాక యిలావస్తాడే?" అంది కుడిది.

"మనల్ని ఆలా ఎందుకు రమ్మన్నాడు? ఆడికేం హాములుంది. మనమీద?" "అదే బ్యూటీ! హాములుంది

రమ్మంటే హస్‌బండ్ ! ఆకర్షించుకు లాక్కుపోతే హుజూర్ హౌండ్" "రాదన్నావు నీవు అదిగో మళ్ళీ ఇలా వస్తూవుంటే— అదే లారీ ! అందులో మళ్ళీ వాళ్ళే వున్నారే ?" అయితే ఆళ్లు నీమీద కన్నేశారన్నమాటే" "నా మీదేస్తే నీమీదా వేశారన్నమాటే"—

పై సందడిలో మందయాన లిద్దరూ లోకాన్ని కానకుండా వుంటే "తప్పుకోండి ! తప్పుకోండి ! చచ్చిపోతారు ! లారీ క్రింద పడి" అంటూ లారీ రంయని ఆ పడుచు లిద్దర్నీ మతో తడవ దాటి పోయింది. "ఈళ్ళకు మతోపని లేదనుకుంటాను" అంది ఎడం పయటది. "మనల్ని తప్పుకోండి తప్పుకోండి అనడంలో. మన ప్రాణాలు కాపాడ్డం లేదే వాళ్ళు ?" అంది కుడి పయటది. "ప్రాణాలు కాపాడ్డం లేదు మన ప్రాణాలు తీసేస్తున్నారు" అంది ఎడం పయటది. "అందరూనా ? వొక్కడా ?" "మళీ అలాంటి మాట అన్నావా లారీ క్రిందకు తోసేస్తాను నిన్ను" "తోసెయ్యి చూస్తాను—తోసెయ్యి !" అంది కుడి పయటిది. ఎడం పయటిది అలా తోసింది, ఆదాకా స్నేహంగా వున్న దీని ఆగ్రహించి పోయి—ఎవర్ని ? తోటిదాన్ని—

గమ్మున లారీకి బ్రేకేసి ఆపేశారు కాని చచ్చిపోయేదే ఆ మనిషి ఆ కుడి పయటిది.

"ఇంతలో మళ్ళీ ఇటు వస్తుందనుకోలేదు మీ లారీ ! ఇంతలో మళ్ళీ వస్తుందనుకోలేదు మీ లారీ" అంటూ కళ్ళ నీళ్ళెట్టుకుంది ఎడం పయటిది—

ఇఖ రోడ్డే నడిచేవాళ్ళు—

ఒకడు : బ్రేక్ ఆ మిలిటరీవోళ్లు చటక్కున వేయకపోతే తెలిసి వుండేది పీళ్ళిద్దరి పసా—

మరొకడు : ఆఁ! అదో బ్యూటీ! లారీ ఆపడానికి వేసిన ఎత్తు!

ఇంకొకడు : వాళ్లు వేసిన ఎత్తు అంటావా ? వీళ్లు వేసిన ఎత్తు అంటావా ?

వేరొకడు : వాళ్ళూ వీళ్ళూ కూడా!

అన్యుడు : అన్యాయం! అన్యాయం! ఆలా అనబోకండి! ఎవరి డ్యూటీవారు చేసుకుపోతూ ఎవరిబ్యూటీ వారు సార్వజనీనంగా కనబరుస్తూ వుంటారు ఈ లోకంలో.

నేను లక్షసార్లు కనిపెట్టాను! డిస్పర్స్! డిస్పర్స్!

.... ... .. .... ....

## ఓ డగుట్టు

ఓ స్త్రీ సన్నంగా వుండిస్నీ. "గురుకచ, ఉరుకుచ, ఘనజఘనచ" అయి అసాధారణమైన అందం ఆనందం వెలిబుచ్చు వచ్చు చూడండీ! ఆలాగ్గా ఇంపూసొంపూ వెలయిస్తూ ఆ పొద్దు గోదావరి స్రవంతీ పెద్ద మేఘాలను ప్రతిబింబిస్తూవుంది; పెద్ద తెరచాపలో కోణంగా బూరటించుకు వున్న పడవలను తేల మోస్తూవుంది; పెద్ద యిసుక తిన్నెలను మెఱయిస్తూవుంది. "మరు న్నారీశిరోరత్నమా అమరున్నారీ శిరోరత్నమా యన్నంత లోకాతీత మనోజ్ఞమైయుంది. విలోకనాద్భుతమై ప్రవహిస్తూవుంది. నాతోపా టెవరైనా ఆ ప్రకృతీ దృశ్యం చూచినవాడై ఆ గడియప్పుడు మరొక్క చదువను వ్రాయను నేర్చినవాడు గనుక తన "డైరీ"లో "నోట్" చేసికొని వుంటే పై వర్ణనలో యతడు నాతో ఏకీభవింపక మానడు. వాని